క్లుప్తంగా

ఎరువుల దుకాణం తనిఖీ



నకరికల్లు: నాణ్యతలేని ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు హెచ్చరించారు. స్థానిక మన గ్రోమోర్ సెంటర్‌లో శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న ఎరువులు, పురుగు మందులు తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో స్టాకు, గోడౌన్‌లో స్టాకు, బిల్లు పుస్తకాలు, అనుమతి పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రకాల ఎరువుల నమూనాలు సేకరించి నాణ్యతా పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబిత సమగ్ర సవరణ సర్వే

ముప్పాళ్ళ: మండలంలో ఓటరు జాబితా ఇంటింటి సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారు ఎం.భవానిశంకర్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌ఓలతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 34,696 మంది ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 25,184 మంది ఓటర్ల పరిశీలన పూర్తయిందన్నారు. మిగిలిన సర్వే ప్రక్రియను ఈ నెల 21లోపు పూర్తి చేయాలన్నారు. అర్హులకు ఓటుహక్కు కల్పించటంతో పాటుగా అనర్హులైన వారి ఓటును తొలగించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు సీహెచ్‌లక్ష్మీప్రసాదు, ఆర్‌ఐలు, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గ్రామ వలంటీర్ మృతి



సత్తెనపల్లి: కట్టావారి పాలెం గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న కొరబండి రవికుమార్ (24) శనివారం మృతి చెందాడు. తుళ్లూరు మండలం పెద్దపరిమి గ్రామం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను తీవ్ర గాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్ కు తరలించగా ఐసీయూలో వెంటిలేటర్ పై చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య అన్నామణి ఉన్నారు. రవికుమార్ మృతి చెందడంతో తల్లిదండ్రులు ఏనోకు, పూలమ్మ, భార్య అన్నామణి కన్నీరు మున్నీరయ్యారు. వలంటీర్ రవి కుమార్ మృతి బాధాకరమని గ్రామ సర్పంచ్ మద మంచి పార్వతి కుమారి సంతాపం తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆమెతోపాటు వైఎస్‌ఆర్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మద మంచి రాంబాబు ఉన్నారు.

గురజాడ సేవలు యువతకు స్ఫూర్తి

నరసరావుపేట ఈస్ట్: నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు సమాజానికి అందించిన సేవలు నేటి యువతకు స్ఫూర్తి కావాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆకాంక్షించారు. ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో నెలనెలా.. సాహిత్య మేళా కార్యక్రమంలో భాగంగా శనివారం గురజాడ అప్పారావు సాహిత్య, సామాజిక సేవ అంశంపై సాహిత్య మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, తెలుగు భాష, సాహిత్యం, సామాజిక అంశాల పట్ల గురజాడ సేవలు స్ఫూర్తి గా నిలవాలన్నారు. క్రమశిక్షణ, దేశభక్తి, సాహిత్యం, పఠనాసక్తి, భాషపై పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఉన్న దురాచారాలు రూపుమాపేందుకు యువతను వైతాళికులు మాత్రమే చైతన్య పరచగలరని తెలిపారు. తొలుత కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌లు తెలుగుతల్లి, గురజాడ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు దేశభక్తి గీతాలను ఆలపించి సభికులను చైతన్యపరిచారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రిటైర్డ్ ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, డాక్టర్ వి.ఎస్.ఎస్. అయ్యంగార్, డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మానందంను కలిసిన మిత్ర బృందం



సత్తెనపల్లి: హైదరాబాద్ గచ్చిబౌలిలోని జరిగిన సినీ హాస్యనటుడు బ్రహ్మానందం రెండవ కుమారుడు సిద్ధార్థ్ వివాహ రిసెప్షన్‌కు సత్తెనపల్లికి చెందిన ఆయన మిత్రులు శుక్రవారం రాత్రి హాజరై అభినందనలు తెలిపారు. సత్తెనపల్లికి చెందిన బ్రహ్మానందం చిన్ననాటి మిత్రులు గంగారపు వెంకట్రావు, టి.పి.కల్యాణరావు, నందా సాంబశివరావు, మారూరి పుల్లారెడ్డి, రంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

మరో రెండు రోజులే..!

- ఈ నెల 21తో ముగియనున్న ఓటర్ల ఇంటింటి సర్వే
- సత్తెనపల్లి నియోజకవర్గంలో 74.07 శాతం పూర్తి
- పట్టణంలో సర్వేను పరిశీలించిన ఆర్డీఓ రాజకుమారి



సత్తెనపల్లిలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి, కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: నియోజకవర్గంలో ఓటరు జాబితా సమగ్ర సవరణ సర్వే వేగంగా సాగుతోంది. గత నెల 21న ఇంటింటి సర్వే ప్రారంభం కాగా ఇప్పటి వరకు 74.07 శాతం మేర పూర్తయ్యింది. మిగిలిన రెండు రోజుల్లో 100 శాతం పూర్తి కావాలి. ఈ నేపథ్యంలో సర్వే గడువును పెంచాలని బీఎల్‌వోలు కోరుతున్నారు. నియోజకవర్గంలో 94,359 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 86,120 గృహాల్లో బీఎల్‌వోలు సర్వే పూర్తి చేశారు. మొత్తం ఓటర్లు 2,32,998 మంది ఉండగా 1,72,588 మంది ఓటర్లను సర్వే చేశారు.

కొత్త దరఖాస్తులు 1,697

ఇప్పటి వరకు సత్తెనపల్లి నియోజకవర్గంలో ఓటరు జాబితాలో చేరేందుకు 1,697 మంది, ఓట్ల తొలగింపునకు 1,070 మంది, పేరు, చిరునామా, ఇంటి నంబర్ మార్పులు చేయాలని 1,512 మంది దరఖాస్తు చేసుకున్నారు.

సర్వర్ మొరాయించినా ...

ఇంటింటి ఓటరు సర్వేకు ఏర్పాటు చేసిన బీఎల్వో యాప్ సర్వర్ పని చేయక పోవడంతో ఆరంభంలో సమస్యలు వచ్చాయి. కొందరు మాన్యువల్‌గా చేసుకుని ఇంటి కొచ్చి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తర్వాత ఈ సమస్యను పరిష్కరించారు.

అవకతవకల గుర్తింపు ..

సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీఎల్‌ఎస్ రాజకుమారి ఇంటింటా ఓటర్ల సర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించి బీఎల్వోలకు, మండల, నియోజ కవర్గ స్థాయిలో పలుమార్లు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారు. బీఎల్వోలు, అధికారులకు ఎప్పటికప్పుడు సందేశాలు ఇచ్చారు. వందశాతం సర్వే పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టి, సున్నా ఇంటి నంబర్లు , ఒకే నంబరుపై ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని గుర్తించి, సరిచేస్తున్నారు.

పట్టణంలో ఇంటింటి ఓటర్ల సర్వే పరిశీలన ...

పట్టణంలో జరుగుతున్న ఇంటింటి ఓటర్ల సర్వేను సత్తెనపల్లి ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీఎల్‌ఎస్ రాజకుమారి శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని 69,70,71 పోలింగ్ స్టేషన్‌లలో సర్వేని పరిశీలించి, ఓటర్లతో మాట్లాడారు.అంతేగాక బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ఈనెల 21 లోపు వందశాతం సర్వే పూర్తికి యత్నిస్తున్నామన్నారు. ఆమెతో పాటు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, బీఎల్వోలు ఉన్నారు.

సత్తెనపల్లిలో శనివారానికి సర్వే వివరాలు..

మండలం	ఓటర్లు	పరిశీలించిన ఓటర్లు	శాతం	ఫారం-6ఎ	ఫారం-7	ఫారం-8
సత్తెనపల్లి టౌన్	46,264	35,953	77.71	335	297	476
సత్తెనపల్లిరూరల్	59,561	48,784	81.91	529	356	484
ముప్పాళ్ళ	34,696	25,184	72.58	153	195	258
రాజుపాలెం	41,061	27,125	66.06	231	80	92
నకరికల్లు	51,416	35,542	69.13	449	142	202
మొత్తం	2,32,998	1,72,588	74.07	1,697	1,070	1,512

పట్టు నిలపుకున్న వైఎస్సార్ సీపీ



వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి షేక్ సైదాబీ, విజయోత్సవర్యాలీ



ధ్రువపత్రం అందుకుంటున్న జైల్‌సింగ్



నియామకపత్రం అందుకుంటున్న విజయలక్ష్మి

క్రోసూరు: మండలంలోని హసనాబాద్ పంచాయతీ 3వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో శనివారం వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి షేక్ క్రోసూరు సైదాబీ 31 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. స్థానిక ఎంపీయూపీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో మొత్తం 234 ఓట్లకు గాను 205 ఓట్లు పోలయ్యాయి. 87.60 శాతం పోలింగ్ జరిగిందని స్టేజ్ -2 ఎన్నికల అధికారి రామాంజనేయులు తెలిపారు. పోలింగ్ అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపులో 116 ఓట్లు వైఎస్సార్‌సీపీ బలపరిచిన షేక్ క్రోసూరు సైదాబికి రాగా , 85 ఓట్లు షేక్ పకుర్ అహ్మద్‌కు వచ్చాయి. 4 ఓట్లు చెల్లలేదు. దీంతో 31 ఓట్ల మెజార్టీతో షేక్ క్రోసూరు సైదాబీ గెలుపొందారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండలంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని మరోసారి ఉప ఎన్నికల ద్వారా రుజువుచేసుకుంది. మండలంలోని పెరికపాడు గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఊడల శ్రీధర్ ఏకగ్రీవం కాగా హసనాబాద్ లో జరిగిన 3వ వార్డు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి పార్టీ పట్టును నిలబెట్టుకుంది.

పోలింగ్ ప్రశాంతం

అచ్చంపేట: మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు వార్డు సభ్యుల ఉప ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. కొండూరు 10వ వార్డులో 275 ఓట్లు ఉండగా 205 ఓట్లు పోలయ్యాయి. గాదె చిన్న గంగమ్మకు 131 ఓట్లు రాగా, బత్తుల తిరుపతి స్వామికి 123 ఓట్లు వచ్చాయి. 8 ఓట్ల మెజార్టీతో చిన్న గంగమ్మ విజయం సాధించింది. 11వ వార్డులో 275 ఓట్లకు 205ఓట్లు పోలవగా కోర్ని తిరుపతి స్వామిపై పిల్లకతువుల చిన్న వెంకయ్య 59ఓట్ల మెజార్టీతో విజయం సాధించించారు. మాదిపాడు 10వ వార్డుకు జరిగిన ఎన్నికలలో మొత్తం 228 ఓట్లకు గాను 176 ఓట్లు పోలయ్యాయి. షేక్ రఫీ భార్య నాగుల్‌బీకి 114 ఓట్లు రాగా, షేక్ సుభాని భార్య నాగుల్‌బీకి 89ఓట్లు వచ్చాయి. 25ఓట్ల తేడాతో రఫీ భార్య నాగుల్ బీ విజయం సాధించింది. చెరుకుంపాలెం 10వ వార్డుకు జరిగిన ఎన్నికలో ఒక్క ఓటు మెజార్టీతో సారెడ్డి నారాయణపై సుంకర బుజ్జిబాబు విజయం సాధించారు. మొత్తం 225ఓట్లు కాగా 185ఓట్లు పోలయ్యాయి. బుజ్జిబాబుకు 93ఓట్లు రాగా, సారెడ్డి నారాయణకు 92 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

సత్తెనపల్లి నియోజకవర్గంలో ఉప ఎన్నిక ఇలా..

మొత్తం వార్డులు	10
ఏకగ్రీవం	10
వైఎస్సార్ సీపీ	8
టీడీపీ	2

రెండు వార్డులు ఏకగ్రీవం

ముప్పాళ్ళ: మండలంలోని రెండు గ్రామాల్లోని వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. మాదల గ్రామ పంచాయతీ 6వ వార్డుకు చిమటా శ్రీనివాసరావు, రుద్రవరం గ్రామ పంచాయతీలోని 7వ వార్డుకు దివిదేవర జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇరువురూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే కావటంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల అధికారుల నుంచి నియామక పత్రాలను స్వీకరించారు.

జూపల్లి మోషె గెలుపు

నకరికల్లు: గుండ్లపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన వార్డు ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపరిచిన జూపల్లి మోషె భారీ మెజారిటీతో గెలుపొందారు. గ్రామంలోని ఐదో వార్డు ఉపఎన్నిక నిర్వహించగా ముగ్గురు పోటీపడ్డారు. వారిలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి జూపల్లి మోషెకు 287 ఓట్లు రాగా కోపూరు పోతయ్యకు 7ఓట్లు, పిల్లల యూసఫ్‌కు 4ఓట్లు పోలయ్యాయి. దీంతో జూపల్లి మోషె 280 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందినట్లు స్టేజ్-1 ఎన్నికల అధికారి ఎంకేఎస్ గిరిధర్ ప్రకటించారు. మోషెను మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అభినందించారు.

ధరణికోట 11వ వార్డు ఘన విజయం

అమరావతి: ధరణికోట 11వ వార్డు మెంబర్ కంభంపాటి శేషయ్య మరణించటంతో శనివారం జరిగిన ఉప ఎన్నికలో వైఎఎస్సార్ సీపీ బలపరిచిన కంభంపాటి శేషయ్య కుమారుడు కంభంపాటి జైల్‌సింగ్ 50ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ధరణికోట రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళాశాలలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 338ఓట్లు పోలవ్వగా అందులో జైల్‌సింగ్‌కు 193ఓట్లు, టీడీపీ బలపరిచిన అభ్యర్థి బేతపూడి అనిల్‌కు 143ఓట్లు వచ్చాయి. పోలింగ్ అధికారి బుచ్చిబాబు జైల్ సింగ్ కు 5 నియామక ధ్రువీకరణ పత్రం అందజేశారు.

బస్సాపురంలో బత్తుల విజయలక్ష్మి విజయం

పెదకూరపాడు: బుస్సాపురం గ్రామంలో 8వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన బత్తుల విజయలక్ష్మి పది ఓట్లు ఆధిక్యతతో టీడీపీ బలపరిచిన అభ్యర్థి నాగరాజుపై గెలుపొందారు. వార్డులో మొత్తం 134 ఓట్లు ఉండగా, వాటిలో 125 ఓట్లు పోలయ్యాయి. ఒక ఓటు చెల్లలేదు. విజయలక్ష్మికి 67 ఓట్లు, నాగరాజుకు 57 ఓట్లు వచ్చాయి. సీఐ వీరాస్వామి, ఎస్సై వెంకట్రావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. నియామక పత్రాన్ని ఎన్నికల అధికారి సత్యనారాయణ విజయలక్ష్మికి అందించారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదాసాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

వాలీబాల్ పోటీల్లో కేంద్రియ విద్యార్థుల ప్రతిభ



ప్రథమ స్థానం సాధించిన అండర్ -14 బాలికల జట్టు



ప్రథమ స్థానం సాధించిన అండర్ -14 బాలుర జట్టు

సత్తెనపల్లి: కేంద్రియ విద్యాలయ హైదరాబాద్ రీజియన్ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. హైదరాబాద్ రీజినల్ స్థాయిలో అండర్-14 విభాగంలో బాలురకు, బాలికలకు పోటీలు నిర్వహించారు. కేంద్రియ విద్యాలయ విద్యార్థుల జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుని, వ్యక్తిగత గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులు బహుమతులు అందుకున్నారు. విజేతలైన అండర్ -14 బాలుర, బాలికల టీమ్‌లు, అండర్ -17 విభాగంలో బాలికలు ఇద్దరు 52వ అల్ ఇండియా కేంద్రియ విద్యాలయ జాతీయ స్థాయి పోటీలకు హైదరాబాద్ రీజియన్ తరుపున సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు అర్హత సాధించినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బి.కిరణ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నిరంతర శ్రమ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రుల ప్రోత్సాహంతో గెలుపు సాధ్యమైందన్నారు. రానున్న రోజులలో మరిన్ని క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు గెలుచుకునేందుకు విద్యార్థులను తీర్చిదిద్దుతామని తెలిపారు.

రుణాలు సకాలంలో చెల్లించేలా శ్రద్ధ వహించాలి

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గ్రామ సమైఖ్య సంఘాలకు శనివారం ఏపీఎం రంగారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఏపీఎం మాట్లాడుతూ ఈ-బుక్ కీపింగ్‌పై ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఉండాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించే విధంగా సీసీలు, గ్రామ సమైఖ్య సంఘాలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. నేటికి స్త్రీ నిధి రూ.1.81 కోట్లు, ఉన్నతి పథకంలో 834 మందికిగాను రూ.2.20 కోట్ల మేర నిధులు రుణాలు అందజేసినట్లు, వీటి రికవరీ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రుణాలు పొందిన వారు తిరిగి రుణాలు చెల్లించాలని, మండల స్థాయిలో 1556 గ్రూపులు, వాటి ఖాతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో సీసీలు, వీ.ఓ.ఎ.లు పాల్గొన్నారు.

ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించండి

నరసరావుపేట టౌన్: ఖైదీలకు అందించే ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆశీర్వాదం పాల్ అన్నారు. శనివారం సబ్‌జైలును సందర్శించిన ఆమె ఖైదులను ఉద్దేశించి మాట్లాడారు. సబ్‌జైల్‌లో పారిశుద్ధ్యం, అందించే వైద్యసదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్, మాదక ద్రవ్యాల నిరోధక చటాల గురించి వివరించారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధి విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌జైలర్ రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ ఆయాలు

నరసరావుపేట: బాల్య వివాహాలు చేయటమనేది చట్టరీత్యా నేరమని, దీంతో పాటు బాలికల ఆరోగ్యానికి ప్రతిబంధకంగా మారుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ బి.మాణిక్యాలరావు పేర్కొన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన నిమిత్తం శనివారం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి బీసీ కాలనీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టారు పర్యవేక్షకులు టి.వెంకటరమణ, ఎం.వెంకటలక్ష్మి, షేక్ గౌస్య, ఎం.వాణి, షేక్ షరీన్ పాల్గొన్నారు.

సమాజం విస్మరించిన వర్గాలకు సముచిత స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

- బడుగు, బలహీన వర్గాల పక్షపాతి సీఎం వైఎస్ జగన్
- నన్ను ఓడించడమే ప్రతిపక్షాల లక్ష్యం
- టీడీపీలో నేతలు లేక ఆయనను అరువు తెచ్చుకున్నారు
- బీసీలు అండగా ఉన్నంత కాలం నన్ను ఓడించడం ఎవరివల్లా కాదు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: సమాజం విస్మరించిన వర్గాలను, రాజ్యాధికారానికి దూరంగా ఉన్న చిన్న కులాలను గుర్తించి, వారికి సముచిత స్థానం, రాజకీయ ప్రాధాన్యతను కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బీసీ కులాల నేతలతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రతిపక్షాలు తనను ఓడించడమే లక్ష్యంగా ఎత్తుగడలు వేస్తున్నాయని, అందుకే తెలుగుదేశం పార్టీలో సరైన నేతలు లేక గుంటూరు నుంచి అరువు తెచ్చుకున్నారని అంబటి విమర్శించారు. పదవుల కోసం పార్టీలు మారిన వ్యక్తులా తనను ఓడించేదని ప్రశ్నించారు.? అమిత్ షా ఫోన్‌తో.. గుండెపోటు వచ్చిందని నాటకం ఆడారని, అనంతరం బీజేపీ అధ్యక్ష పదవిని అడ్డంపెట్టుకుని.. ఎన్నికల నిధులు కాజేయడంతో ఆ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించిందని విమర్శించారు. తిరిగి అధికారం కోసమే తెలుగు దేశం పార్టీలో చేరాడని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణను పరోక్షంగా విమర్శించారు. ఈ నెల 22న సత్తెనపల్లిలో నియోజకవర్గ స్థాయిలో జరుగనున్న బీసీ గర్జనను జయప్రదం చేయాలని మంత్రి అంబటి పిలుపునిచ్చారు. కుమ్మరి, రజక సామాజిక వర్గాల నేతలు ప్రత్యేక చొరవ తీసుకొని వార్డులు, గ్రామాల నుంచి అత్యధికంగా ఈ సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, మండల పార్టీ కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, కో-ఆప్షన్ మెంబరు సహరా మౌలాలి, నాయకులు రాజారపు శివ నాగేశ్వరరావు, సెగ్గెం వెంకటేశ్వర్లు, ఉల్లంగుల ప్రసాద్, సత్తెనపల్లి సైదులు, నల్లబోతు శివన్నారాయణ, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలకా జైపాల్, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న సీఎం జగన్

పేదలందరికీ సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల జగనన్న కాలనీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ నవరత్నాల పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేదలకు నిర్మిస్తున్న పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తోడు డ్వాక్రా రుణం రూ.35 వేలు కలుపుకొని పేదలు ఇళ్లు నిర్మించుకుంటున్నారన్నారు. కాలనీలో మెరక పనులు, రోడ్ల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల గృహ ప్రవేశాలు లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనిలో ధూళ్ళిపాళ్ల గ్రామం కూడా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌తో పాటు పల్నాడు జిల్లాలోని శాసన సభ్యులు అందరూ హాజరవుతారని, దీని దృష్టిలో పెట్టుకొని తాత్సారం చేయకుండా వేగవంతంగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని, అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. గృహ ప్రవేశాలను దృష్టిలో పెట్టుకొని అందుకు అవసరమైన అన్ని వసతులు, వనరులు కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆర్చ్, రహదారుల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లేఅవుట్ల అభివద్ధికి రూ. 2.3 కోట్లు మంజూరు కాగా 316 పక్కా గృహాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు.

21 నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు దేవాలయం ప్రత్యేక అలంకరణ

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 11వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పాత్తూరి వెంకటరమణసుబ్బారావు శనివారం తెలిపారు. దేవస్థానాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో కనులు మిరుమిట్లు గొలిపేలా అలంకరించారు. 21న సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, మధ్యాహ్నం భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం అన్నమయ్య పద్య నాటకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 22న అగ్ని ప్రతిష్ఠ, అరణి మందనం, నవోదయ పాఠశాల విద్యార్థునుల కోలాటం, సాంస్కృతిక ప్రదర్శన జరుగుతాయని తెలిపారు. సాయంత్రం శ్రీకృష్ణ రాయభార పద్య నాటకం ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. 23న యాగశాలలో శాంతిపాఠం, నిత్య పూర్ణహుతి, కోలాటం, పూలరంగడు(భక్త చింతామని) నాటకం, 24న పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక పూజలు చేయించుకునే వారు ముందుగా ట్రస్ట్ చైర్మన్‌కు తెలపాలని కోరారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకోవాలని చైర్మన్ కోరారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ



అగ్ని ప్రమాదం నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

సత్తెనపల్లి: అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని అగ్నిమాపక అధికారి సుబ్బారావు అన్నారు. జిల్లా విపత్తు, స్పందన, అగ్నిమాపక అధికారి ఎస్ శ్రీధర్ ఆదేశాల మేరకు సత్తెనపల్లి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోదాంలో సిబ్బందికి, వర్కర్లకు అగ్నిప్రమాదం సంభవిస్తే దాన్ని ఎలా ఎదుర్కోవాలి? అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే దానిపై శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అవగాహన ద్వారానే అగ్ని ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందన్నారు. అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటి నుంచి ఏ విధంగా బయటపడవచ్చో.. ప్రత్యక్షంగా డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎం.మోహన్‌బాబు, కె.శ్రీనివాసరావు, సీహెచ్ సాగర్‌బాబు, షేక్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జన్మనక్షత్ర పూజలు

నాదెండ్ల: గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మ నక్షత్ర పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి లక్ష మల్లెపూలతో అలంకరించారు. మ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామానికి చెందిన బాదం వెంకటసుబ్బారావు, లక్ష్మీ శేషమాంబ దంపతులు ప్రసాదాల వితరణ చేశారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పునరుద్ధరణ పనుల నిమిత్తం రూ. 2 లక్షల 116 రూపాయలు భక్తులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు-మస్తానమ్మ దంపతులు తమవంతు విరాళంగా అందజేసినట్లు వినుకొండ పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం తెలిపారు.